
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు. 250/-లు బహుమతి పొందిన రచన


# తప్పెవరిది..



బందరు దుర్గాప్రసాద్

తకిట... తకిట... తధిం తకిట... ...! తకిట... తకిట... ... ... ....తధిం తకిట... ...!కర్కశంగా మ్రోగుతూంది డప్పుల శబ్దం.

సమయం సుమారు ఒంటి గంట, రెండవుతుంది. అందరి భోజనాలయి, తీరిగ్గా కూర్చునే సమయమది. అది గారడీ వాళ్ల బృందం. అక్కడ వాళ్ల విడిది.



గారడీ చూట్టానికి జనం చుట్టూ గుమి గూడి ఉన్నారు. డప్పు ఇంకా గట్టిగా మ్రోగుతూంది. బృందంలో ఆరేడుగురు ఉన్నారు. ఓ ముసలాడు, ముసల్ది, కొడుకు, కోడలు, ఇద్దరో ముగ్గురో పిల్లలు. ఆ రోజే వాళ్ళు ఆ ఊరికి బస మార్చారు.

వాళ్లు ఇవ్వ బోయే ప్రదర్శనకు ముందు స్వాగత వచనం- ఆ డప్పుల శబ్దం. ఒక్కొక్కరూ ఫీట్స్ చూపిస్తున్నారు. వాయిస్తున్న చిన్నపిల్లడి చేతిలోనించి డప్పు తీసుకుని ముసలాడు కొడుకుతో అన్నాడు...

“అరే, అయ్యా! బాబు లందరూ నీ ఇద్దెలు చూడడాని కొచ్చారు్రా! దరమ పెబువులు. నీ ఇద్దెలు చూపించరా! ముందు ఆంజనేయ సా..వికి దణ్ణ మెట్టుకో!”అంటూ, రెండు వేళ్ల నోట్లో పెట్టి, గట్టిగా ఈల వేసి మళ్లీ డప్పు వాయించడానికి ఉపక్రమించాడు ముసలాడు.

కొడుకు రెండు చేతుల్తో ఒక నిచ్చెన పట్టుకున్నాడు. డప్పు వాయించిన పిల్లవాడు, నిచ్చెన చివరి వరకూ ఎక్కి, అక్కడ బోర్లా పడుకున్న తరువాత నిచ్చెనను మీదకు ఎత్తుతూ, తలను పైకెత్తి, నిచ్చెన ఒక కాలు గడ్డంపై ఆనించి, బాలెన్సుగా రెండు చేతులు వది లేశాడు.

తన గడ్డం మీద నిచ్చెన. నిచ్చెన చివర్లో పిల్లడు. ఏ ఆధారమూ లేదు. జనం కుతూహ లంతో చూస్తున్నారు. మళ్లీ చేతుల్తో నిచ్చెనను పక్కకు తోసేస్తూ చేతులు రెండూ ముందుకు చాచాడు.నిచ్చెన క్రింద పడిపోయింది. అంత ఎత్తు నుంచి పిల్లడు ఆ రెండు చేతుల్లో పడ్డాడు. జనం ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు.

తరువాత లావుగా ఉన్న ఒక పొడవైన వెదురు కర్రను నిలువుగా పాతారు. పదిహేను, పదహారేళ్లున్న ఆడపిల్ల- లంగా, ఓణీ వేసుకుని ఉంది. పైట చెంగు జారి పోకుండా, బలంగా బొడ్లోకి దోపుకుని, గబగబా సుమారు ముప్పై నలభై అడుగులున్న ఆ కర్ర ఎక్కిపోయింది. దాన్ని “ఈటిగడ కర్ర” అంటారు. చివరి వరకూ పోయి, కర్ర కొసలో బొడ్డు తిన్నగా ఉన్న భాగాన్నుంచి, రెండు కాళ్లూ, చేతులూ, చాపేసి, నాలుగైదు నిముషాలు గిర్రున చక్రంలా తిరిగింది. ఆ మీదకు చూసే సరికి

## నాగురించి

స్వస్థలం - శ్రీకాకుళం జిల్లాలోని 'కవిటి'. 1964 - సెప్టెంబర్ 1 వ తేదీ జన్మదినం. మా నాన్న గారు శ్రీ బందరు మోహనాంగరావు గారు. చదువు - ప్రస్తుతం బి.ఏ. ప్రైవేట్‌గా చేస్తూ 'శ్రీరామకృష్ణ విద్యా విహార్' ఇంగ్లీష్ మీడియం స్కూలును నడిపిస్తున్నాను.

తొలిసారిగ నాలుగు మాసాల క్రిందట 'భారతి' మాసపత్రిక వారు 'స్వాగతము' కవిత (పద్యాలు) స్వీకరించారు. రావి శాస్త్రిగారి పాత్ర చిత్రణ, జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి కవితా స్రవంతులు నాకు అభిమానములు.



మొదటి సారికే బహుమతి అందుకున్నదీ, మొట్ట మొదటి సారికే 'అమెరికా' కూడ వెళ్తున్నదీ - ఈ కథే.

—బందరు దుర్గాప్రసాద్, కవిటి

నాకు కళ్లు తిరిగాయి. చూడలేక తల దించుకున్నాను. ఆ తరువాత ఆ పిల్ల దిగిపోయింది.

ముసలాడు ఒక పెద్దరాయి పట్టుకుని కొడుకు దగ్గరకు వచ్చాడు. "అరేయ్! ఇప్పుడు నువ్వు ఇక్కడ పడుకోవాల. నేను ఈ రాయి నీ మీద ఎత్తుతాను- గుండెతో కాయాల... ... ... ఏ...ం...?" అంటూ గట్టిగా ఈల వేశాడు. సరేనని కొడుకు వెల్లకిల పడుకున్నాడు.

ఎత్తునుంచి దభేల్న వాడి గుండె మీద అంత పెద్ద రాయి వేశాడు. వాడేమవుతాడో నని భయంతో నాకు గుండె ఝల్లుమంది. కించిత్తయినా వాడు చలించలేదు కదా. తిరిగి ఆ రాయి తీసుకుని గట్టిగా మోచేత్తో రెండు మూడు సార్లు మోదాడు. అంతే..! అది రెండు ముక్కలై పోయింది.

ఇంతలో ఒక సన్నని ఇనుపరింగు తీసుకొచ్చాడు ముసలాడు. కొడుకునీ, మనవణ్ణీ దగ్గఱకు పిల్చి, రింగు చూపిస్తూ అన్నాడు. "చూశారా, ఈ రింగు, దీంట్లో ఒక్కడే దూర గలడు. మీరిద్దరూ దీంట్లో దూరి బైటికి రావాలా!"-అంటూ వాళ్ల మెడలో వేశాడు.

పాపం ఓ పది నిముషాల సేపు ఆ రింగులో తండ్రీ కొడుకు లిద్దరూ, క్రిందా మీదౌతూ, తన్నుకుంటూ, నానా యాతన అనుభవించారు. బయట కొచ్చేసరికి వాళ్ల శరీరాలు తట్లుదేరిపోయి, ఎర్రగా కంది ఉన్నాయి. వాళ్ల దయనీయ పరిస్థితి చూసి, ఎంతో జాలి వేసింది. "పు రా కృ త ం కే న వి ల ం ఘ్య తే"? అనుకున్నాను. వారి తలరాతను మార్చించే శక్తి నాకుందా...?

ఆ తరువాత కోడలు వచ్చి, మరో ఫీట్ చేసింది. తీగ మీద నడవటం. రెండు వైపులా రెండు కర్రలు పాతి, రెంటికీ కలిపి ఓ ముదురైన తీగతో కట్టారు. తీగకు ఒక వైపు ఎక్కి, నడుచుకుంటూ రెండో వైపు చేరుకోవాలి! ఆమె తీగ మీదకు చేరి నిలుచుంది. జాగ్రత్తగా ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ నడుస్తోంది. బాలెన్సు తప్పి ఏ మాత్రం కాలు పట్టు జారినా, క్రింద పడవలసిందే! అలాగే చూస్తున్నాను.

ఇంతలో చిన్న పిల్ల నా దగ్గఱకు వచ్చి, వచ్చీ రాని ముద్దుమాటలతో, ఏసగా "బాబూ, బాబూ,మా అమ్మ తీగమీద నడుత్తోంది. ఒక్క పైచా ఇయ్యి బాబూ!"అంది. ఆ పిల్లనే చూస్తూ



Chhaya/PP/41.5

అలాగే ఉండి పోయాను. హృదయంలో బయటకు కనిపించని కన్నీళ్లు ఉప్పొంగాయి. మస్తిష్కంలో ఏవేవో ఆలోచనలు—

'భగవాన్! నీ లీల లెంత చిత్రంగా ఉంటాయి స్వామీ! ఒక్కొక్కరినీ ఒక్కొక్క రకంగా సృష్టిస్తావ్. ఆ కుటుంబం రోజంతా చెమటోడ్చి శ్రమపడినా వాళ్లకు పొట్టగడవటం కూడ కష్టమే. నేను దర్జాగా ఆఫీసుకెళ్లి, కాలు మీద కాలేసు క్కూర్చుంటే నెలకు వెయ్యి రూపాయలు. ఎంత భేదం? ఎంత వ్యత్యాసం? ఎందుకు స్వామీ నీకింత పక్షపాతం? ఏమో... ... నా సామాన్య పరిజ్ఞానంతో నిన్నెలా అర్థం చేసుకోగలను ?'

మళ్లీ ఆ పిల్ల పిలుపు.

"బాబూ, బాబూ! ఒక్క పైసా ఇయ్యి బాబూ". ఆ పిలుపుతో ఊహాలోకం నుంచి తేరుకుని బాహ్యప్రపంచానికి వచ్చాను.

ఎదురుగా పిల్ల- చెయ్యి చాపి దీనంగా చూస్తుంది. కనికరంగా కనిపిస్తోంది. జేబులో చెయ్యి పెట్టాను. ఉన్న ఒక్క రూపాయి బిళ్ల తీసి- వేశాను.

మాయ, మర్మం, ఈర్ష్య, అసూయ, ద్వేషం, పగ, తెలియని వయస్సది. ఆ వయస్సులో మనస్సు నిర్మలంగా, నిష్కల్మషంగా ఉంటుంది. రూపాయి బిళ్ల తీసుకుని నవ్వుకుంటూ వెళ్లి పోయింది.

ఆఖరుగా ముసలాడు చివరి ఫీట్ చేశాడు. ముసలాడు-కత్తులు విసిరి కాయడంలో మంచి ఎక్స్‌పర్ట్.

శరీరం నిండా లొత్తలతో జీర్ణావస్థలో నున్న ఒక సిల్వర్ పాత్ర తీసుకొని, మూగి ఉన్న జనం చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది-ముసలిది. "కత్తులాట శాన కట్టం బాబూ! బాబూ, దరమం సెయ్యండి బాబూ, దణ్ణాలు బాబూ!" అంటోంది. తలా ఒక్కొక్కరూ తోచినంతగా వేస్తున్నారు. అయిదులూ, పదులూ, పావలాలూ- చిల్లర కూడ ఆ పళ్లెంలో రకరకాలుగా ఫీట్స్ చేస్తున్నట్లుంది.

ముసలాడు పిడిబాకుల్లాంటివి మూడు తీసుకున్నాడు. మూడింటినీ ఒకేసారి పైకి విసిరి, అవి క్రింద పడే లోగా, నేల మీద పడుకుని, కాళ్లూ చేతులూ దూరంగా చాపాడు.

ఒక బాకు వచ్చి, సరిగ్గా రెండు కాళ్లకు మధ్యలో పడింది. ఇంకొకటి-కుడివైపు చేతికీ, గుండెకూ మధ్యలో పడింది. మూడోది కూడ వస్తుంది. తిన్నగా వచ్చి, ఎడమ వైపు చేతికి, గుండెకూ మధ్యలో పడింది.

క్షణ కాలం భయంతో నిశ్చేష్టులైన జనం కోలాహలంగా, ఉత్సాహంతో కేకలు వేస్తూ చప్పట్లు కొడుతున్నారు.

అరగంట నుంచీ ఈ గారడీ అంతా చూస్తూ, ఎదురుగా ఉన్న పెద్ద మేడ, పై అంతస్తులో, ఈజీ ఛైర్‌లో కూర్చుని ఉన్నారు- నాయుడుగారు. పాలేరును పంపించారు. రెండు రూపాయల నోటు పట్టుకొచ్చాడు పాలేరు- వాళ్ల మధ్యకి.

"అరేయ్, ముసిల్నా కొడకా! ఈ రోజు నీ పంట పండింద్రా! ఇందా, ఈ రెండ్రూపాయలూ తీసుకొని, మళ్లీ కత్తులాట ఆడమన్నార్రా, బాబుగారు"! అని వెళ్లి పోయాడు.

మళ్లీ మూడు కత్తులూ అందుకున్నాడు- ముసలాడు. పైకి విసిరి, నేల మీద పడు కున్నాడు. ఒకటి వచ్చి, రెండు కాళ్ల మధ్యలో ఇసుకలో నాటుకుంది. రెండోది వచ్చి, కుడివైపు చేతికీ, గుండెకూ మధ్య ఖాళీలో పడింది. "సెబాస్!" అంటూ నాయుడు గారు మేడ పైనుంచి చప్పట్లు కొట్టారు. అందరూ, అటువైపు తల త్రిప్పారు.

మూడోది కూడ వస్తుంది. తిన్నగా వస్తుంది ఎవరో గురిచూసి బాణం వదిలినట్టు. ఎడమవైపు పడలేదు. కుడివైపుకు రాలేదు. గురి తప్పింది. వేగం పెంచుకుంది. కసిగా దూసుకొచ్చేస్తూంది. వచ్చేస్తుంది. వచ్చేసింది. అంతే...! వచ్చి, సరిగ్గా ఆ ముసలాడి... ... ... కడుపులో ... ... ... బలంగా... ... ... ...! అంతే...! అయిపోయింది.

నల్లటి మబ్బు తునక ఒకటి సూర్యుడికి అడ్డుగా వచ్చి నీడ కాసింది. క్షణం సేపు గాలి స్తంభించింది.

జనం నాయుడు వైపు చూస్తున్నారు.

"అమ్మా... ...!" ఒక్కటే ముసలాడి కేక.

ప్రేక్షకుల దృష్టి ఒక్కసారి ముసలాడి వైపు మరలింది. క్షణంసేపు అందరికళ్ళూ అప్రయత్నంగా మూత పడ్డాయి. అర నిముషంలో అంతా జరిగి పోయింది.

నెత్తురు ధారలయ్యింది. అయిదు నిముషాలు ముసలాడు- అందులో నరక యాతన పొందాడు. తరువాత వాడి అంత్య శ్వాస-అనంత వాయువుల్లో కలసి పోయింది.

ముసలాడి చి వ రి ఫీట్ పూర్తయింది. భార్య, కొడుకు, మనుమలు అంతా శవం మీద పడి, గొల్లుమన్నారు.

సన్నివేశం భీభత్సంగా ఉంది. చూస్తున్న నేను అలాగే అచేతనంగా నిల్చుండి పోయాను- బొమ్మలా!

'ఏమిటిది? ఎందుకిలా జరిగింది? తప్పెవరిది? కత్తిదా? పాలేరుదా...? నాయుడు గారిదా? ముసలాడిదా? ఎవరిదీ కాదా? ఎవరిదీ కాక పోతే ముసలాడు ఎలా చంపబడ్డాడు?

'కత్తిదా... ...? అది నిర్జీవం. పాపం దానికేం తెలుసు. వీడు నా యజమాని- ఇతణ్ణే చంపవచ్చు, ఇతణ్ణే చంపరాదన్న విషయం.

వినోదంగా చూస్తూ మళ్లీ కత్తులాట ఆడుమని, రెండు రూపాయలు దానం చేసిన ఆ పెద్ద మనిషిదా? పాపం-వాడి గురి తప్పుతుందని, ఆ కత్తి వాడి ప్రాణం తీస్తూందని, ఆ నాయుడు గారికేం తెలుసు. మరి... ...?

'తప్పు పాలేరుదా? తన యజమాని చెప్పిన కార్యం నిర్వర్తించాడు. అతనిచ్చిన డబ్బుల్ని తీసుకొచ్చి ముసలాడి కిచ్చాడు-కార్య నిర్వాహకుడు. ముసలాడి మీద తనకేం క్రోధం, ద్వేషం లేదు. వాడు మరణిస్తే తన కొరిగేదేం లేదు. వాడు మరణించాలని తను కోరుకోనూ లేదు.

'అయితే... .... ...??

రెండు రూపాయలు దొరికాయన్న సంతోషంలో, ఆనందంగా, మళ్లీ తన విద్యా కౌశలాన్ని చూపించాలనుకున్న ముసలాడిదా తప్పు... ... ... తన ప్రావీణ్యతను, నైపుణ్యాన్ని మళ్లీ నలుగురిలో ప్రదర్శించాలనుకున్నాడు. కానీ వాడు ఏ దురాశా పడలేదే... ...?

అయితే మరెవరిది తప్పు, వీరిలో!'

పాఠకులారా! వీరిలో తప్పెవరిదో బాగా ఆలోచించి, మీరే నిర్ణయించండి.

## తరంగాలు

ఉగ్గ బట్టిన ప్రేమ మూర్తి ఒక్కసారి
వ్యక్తమై మది భళ్ళున వ్రక్కలగుచు
పగటి యెండకు సీసాలు పగిలి చెదరి
గాయమగునట్లు నీ బుగ్గ గాట్లు పడును.

—కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ